హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి జిల్లాకు రాక

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ చీమలపాటి రవి శనివారం జిల్లా పర్యటనకు నగరానికి చేరుకున్నారు. జిల్లా కోర్టులో జరిగిన న్యాయాధికారుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవిని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, జిల్లా ఎస్.పి. వకుల్ జిందాల్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి సాయికల్యాణ్ చక్రవర్తి ఉన్నారు.

సమిష్టి సహకారంతో నగరాభివృద్ధికి కృషి : నగర మేయర్ విజయలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం : అందరి సమిష్టి సహకారంతో నగరాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. శనివారం విజయనగరం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 26 అంశాలను, 14 అనుబంధ అంశాలను పొందు పరిచారు. సాధారణ సమావేశంలోని అజెండా అంశాలలో రెండు మినహా మిగిలిన అన్నింటికీ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశానికి ముందు ఈ మధ్య మృతి చెందిన 34వ డివిజన్ కార్పొరేటర్ బాలి పైడిరాజు, మాజీ కౌన్సిలర్ మేకా కాశీ విశ్వేశ్వరుడు అకాల మరణానికి సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ ఎస్వివి రాజేష్, కోఆప్షన్ సభ్యులు ఆశపు వేణు మాట్లాడుతూ దివంగత సభ్యుల సేవలను కొనియాడారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ డివిజన్లో చేపట్టే వివిధ పనుల్లో కార్పొరేటర్ల సూచనలను, సలహాలను పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. ఇంటర్ కనెక్షన్ విధానంలో పూర్తి పారదర్శకత ఉండాలన్నారు.అనంతరం అజెండాలో పొందుపరిచిన అంశాలపై సభ్యులు చర్చించారు. తదుపరి రెండు అంశాలు మినహా మిగిలిన అన్ని అంశాలకు ఆమోదం తెలిపారు. అలాగే ప్రభుత్వం జారీ చేసిన భవన నిర్మాణాల నిబంధనల వివరాలను అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు సభ్యులకు వివరించారు. సమావేశాన్ని ఉద్దేశించి మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో అన్ని రంగాలను అభివృద్ధి చేసేందుకు అందరి సహకారంతో కృషి చేస్తున్నామన్నారు. ప్రతి అంశంపై సుదీర్ఘ చర్చ జరిగిన అనంతరం సభ్యుల సమ్మతితో అజెండాలో అంశాలకు ఆమోదం తెలుపుతున్నామన్నారు. ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే ఆంధ్ర జలాశయం నుండి విడుదలైన నీరు చంపావతి వద్ద నున్న అమృత బావుల వద్దకు చేరిందన్నారు. వేసవిలో నీటిని పొదుపుగా వాడుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కే అప్పలరాజు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉల్లాస్ పరీక్ష ఏర్పాట్లపై అవగాహన

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో ఈనెల 23న అనగా ఆదివారం నిర్వహించే ప్రాథమిక అక్షరాస్యత పరీక్ష ఏర్పాట్లపై సిసిలు,అంగన్వాడీ కార్యాకర్తలు, విఓఏలుకు శనివారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిసిలు, విఓఏలు, అంగన్వాడీ కార్యాకర్తలును ఉద్దేశించి వెలుగు ఏపీఎం ధనలక్ష్మి మాట్లాడుతూ ఉల్లాస్-నవభారత సాక్షరతా కార్యక్రమంలో భాగంగా ఈనెల 23 తేదీన వెలుగు, ఐసీడిఎస్ శాఖలు ఆధ్వర్యంలో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆదివారం ఉదయం 10గంటలు నుండి సాయంత్రం 5గంటలు మధ్య లబ్దిదారులు వారికి వీలైన సమయంలో 3గంటలు పాటు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మొదటి పేజ్‌లో 1,830 మంది నిరక్షరాసులును ఎంపిక చేసి వారికి స్వయం సహాయక సంఘం సభ్యులుచేత అక్షరాలను చదవటం, రాయటం, లెక్కలు నేర్పించటం జరిగిందని, వారు ఏమాత్రం పురోగతి సాధించారో తెలుసుకునేందుకు ఈపరీక్ష నిర్వహించటం జరుగుతుందని ఆమె అన్నారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పరీక్ష నిర్వహించేందుకుగాను మండలంలో 44 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అంగన్వాడీ కార్యాకర్తలు, వెలుగు విఓఏలుచే పరీక్షలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ తాడ్డి శ్రీదేవి, వెలుగు సిసి శాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం : మండల కేంద్రంలో శనివారం కలిసిన విలేకర్లతో ఎండిఓ అర్.రాంబాబు మాట్లాడుతూ తెలిపిన వివరాల మేరకు ఉల్లాస్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి ఆశిస్మెంట్ టెస్ట్ (ఎఫ్ఎల్ఎన్ఏటి) నిర్వహించనున్నారని, చదువురాని వయోజనులకు రోజు వారీ పనుల్లో ఉపయోగపడేలా చదివించి జీవన నైపుణ్యాలు నేర్పించడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. మన రాష్ట్రం లో గత నవంబరు నుండి స్వయం సహాయక బృందంలో ఉండే మహిళలకు వారి బృందంలోనే చదువుకున్న మహిళలతో చదువు చెప్పించడం జరుగుతుంది అని అలా చదువుకున్న మహిళలకు ఎంతవరకు పురోగతి సాధించారు అని అంచనా వేయడానికి ప్రభుత్వం ఒక పరీక్షను మార్చి 23వ తేదిన అనగా ఆదివారం నిర్వహించాలని నిర్ణయించింది అని అన్నారు. ఈ పరీక్ష ఉదయం 10గంటలు నుంచి సాయింత్రం 5 గంటల మధ్య 3 గంటల పాటు ఉంటుంది అని లబ్ధి దారులు వారికి వీలైన సమయంలో పరీక్ష కేంద్రానికి వచ్చి రాసుకుని వెళ్ళవచ్చు అని తెలిపారు. ఈ ఎఫ్ఎల్ఎన్ఏటిలో ఉత్తీర్ణులైన వారికి అక్షరాస్యులుగా గుర్తించి జాతీయ సార్వత్రిక విద్య సంస్థ వారు అధికారిక ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు అని ఈఅవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎండిఓ రాంబాబు కోరారు. తనతోపాటు ఏపిఎం రాము ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవం

- టిబి నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేద్దాం
- డిఎంఅండ్‌హెచ్ఓ, టిబి కంట్రోల్ అధికారి పిలుపు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : క్షయరహిత జిల్లాగా మార్చేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి, క్షయ నియంత్రణాధికారి డాక్టర్ కె.రాణి పిలుపునిచ్చారు. స్థానిక డిఎంఅండ్ హెచ్ఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డిఎంఅండ్ హెచ్ఓ జీవనరాణి మాట్లాడుతూ టిబిని అంతం చేయగలం అన్న నినాదంతో ఈనెల 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా టిబి వ్యాధిపై అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. 2025 నాటికి టిబి వ్యాధిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో పనిచేయడం జరుగుతోందని తెలిపారు. జిల్లాను 10 టిబి యూనిట్లుగా విభజించి, వ్యాధి నిర్మూలకు వివిధ చర్యలను చేపట్టామని అన్నారు. క్షయ అన్నది అంటువ్యాధి అని, లక్షణాలు ఉన్నవారు ఖళ్లె పరీక్ష చేసుకొని వ్యాధిని నిర్ధారించుకోవాలని సూచించారు. రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, కఫంలో రక్తపు జీరలు, రాత్రిపూట చెమట పట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసటగా ఉండటం, మెడవద్ద వాపు తదితర లక్షణాలు ఉంటే టిబి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డిసెంబరు 7న ప్రారంభించిన 100 రోజుల టిబి కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, నిర్ధారణా కార్యక్రమాన్ని కూడా నిర్వహించామని, 861 క్షయ కేసులను గుర్తించామని తెలిపారు. టిబి వ్యాధి సోకేందుకు ఎక్కువగా అవకాశం ఉన్న 60 ఏళ్ల దాటిన వారిని గుర్తించి, వారికి బిసిజి టీకాలను వేయడం జరుగుతుందని చెప్పారు.జిల్లా క్షయ నివారణాధికారిణి డాక్టర్ రాణి మాట్లాడుతూ, టిబి రోగులు వ్యాధినుంచి వేగంగా బయటపడాలంటే వ్యక్తిగత కృషితోపాటు, సామాజికంగా నైతిక సహకారం కూడా అవసరం అన్నారు. వైద్యులు సూచించిన మేరకు మందులు వాడుతూ, తగిన జాగ్రత్తలను తీసుకొంటే ఆరు నెలల్లోనే టిబి ని నయం చేయవచ్చునని చెప్పారు. టిబి వ్యాధిగ్రస్తులకు పోషకాహారం, ఇతర సహాయ సహకారాలను అందించేందుకు నిక్షయ మిత్రలు కృషి చేయాలని కోరారు. ఒక్కో వ్యాధిగ్రస్తుడికి నెలకు రూ.700 ఇవ్వడం ద్వారా నిక్షయ మిత్రలుగా మారవచ్చునని చెప్పారు. ఎన్‌పిఐ కార్యక్రమంలో భాగంగా క్షయ రోగులకు రూ.1000 చొప్పున ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. టిబి వ్యాధిని నయం చేసేందుకు అవసరమైన అన్ని రకాల మందులు, ఆధునిక పరికరాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-బాడంగి: మండలం కోటిపల్లి గ్రామానికి చెందిన పెంటపల్లి శ్రీను మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తారకేశ్వర రావు తెలిపారు. ఆయన వద్ద నుంచి 20 మద్యం బాటిల్ శనివారం స్వాధీనం చేసుకున్న మని ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అక్రమంగా మద్యం తరలించిన విక్రయించిన చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు.

నాటుసారా నిర్మూలనకే నవోదయం 2.0

కొత్తవలస ఎక్సైజ్ సిఐ రాజశేఖరనాయుడు

విశాలాంధ్ర-కొత్తవలస : గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారాయి పూర్తి స్థాయిలో నిర్మూలించే దిశగా ప్రభుత్వం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆద్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని కొత్తవలస ఎక్సైజ్ సిఐ రాజశేఖరనాయుడు అన్నారు. కొత్తవలస మండలం రామలింగా పురం గ్రామంలో శనివారం నవోదయం 2.0 అవగాహన సదస్సును ఏర్పటు చేశారు. ఈ సంద్రభంగా ఆయన మాట్లాడుతూ నాటు సారాయి తయారీ, రవాణ, అమ్మకం లాంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచ్ నెక్కల గౌరినాయుడు, సబ్ ఇన్ స్పెక్టర్ వి.ఎన్.రాజు, సిబ్బంది హెచ్.సి ప్రసాద్, వీర్రాజు, బి.ఆదినారాయణ, హరికిరణ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, సచివాలయ సిబ్బంది, గ్రామ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-గంట్యాడ: గంట్యాడ మండలం, గంట్యాడ గ్రామంలో రాష్ట్ర సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు గ్రామీణ పేదరిక నిర్మూలన ఎన్నారై సాధికారిక సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వగృహంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేయడం జరిగినది. నియోజకవర్గం స్థాయిలో గజపతినగరం దత్తరాజేరు మండలం గంట్యాడ మండలం జామి మండలాల్లో 8 మంది లబ్దిదారులకు 9.72 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనారోగ్యంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతు సహాయం కోసం ఎదురుచూస్తున్న అనేకమందికి ముఖ్యమంత్రి సహాయనిది ఆసరాగా మారిందని ప్రభుత్వం నుంచి విడుదలైన ఈసహాయాన్ని వినియోగించుకొని మెరుగైన వైద్యాన్ని పొంది ఆరుగకరమైన జీవనం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు గంట్యాడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెస్టోస్కోప్ యాప్ రైతులు సద్వినియోగం చేసుకోవాలి

సిఎస్ఏ కో-ఆర్డినేటర్ రాంప్రసాద్



విశాలాంధ్ర-వేపాడ : ప్రస్తుతం వ్యవసాయ పద్ధతులపై వినియోగిస్తున్న వెస్ట్రోస్కోప్ యాప్ రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సుస్థిర వ్యవసాయ కేంద్రం కోఆర్డినేటర్ రాంప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని బొద్దాం గ్రామంలో సుస్థిర వ్యవసాయ కేంద్ర కార్యాలయం వద్ద సబల్ ప్రాజెక్ట్,రీజినల్ కోఆర్డినేటర్ వెంకటరావు సారథ్యంలో శనివారం మోడల్ రైతులుకి , ఆర్ వై ఎస్ ఎస్ సిబ్బందికి, మెంటర్స్, ఫార్మర్ సైంటిస్టుకు పెస్టోస్కోప్ యాప్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కో -ఆర్డినేటర్ రాంప్రసాద్ మాట్లాడుతూ ముందుగా పంటలకు పట్టిన పురుగులు, తెగుళ్లను ఎలా గుర్తించాలన్న విషయంపై కూలంకుశంగా పెస్ట్ స్కోప్ యాప్ ఆవశ్యకతను అందరికీ తెలియజేశారు. అనంతరం ఈ యాప్ ను స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి రైతుతో డౌన్లోడ్ చేయించి ఏ విధంగా వాడాలో తెలియజేసి క్షేత్రస్థాయిలో ప్రయోగపూర్వకంగా చూపించారు.అలాగే ప్రకృతి వ్యవసాయంపై రైతు క్షేత్ర దినోత్సవం సందర్భంగా సుస్థిర వ్యవసాయ కేంద్ర పరిధిలో కొండగంగు బూడి క్లస్టర్లో పలు గ్రామాలలో సుస్థిర వ్యవసాయ కేంద్ర సారథ్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఉత్తమ రైతులను గుర్తించి వారికి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది రమాదేవి, నాగమణి, మదీనా, ఆర్ వై ఎస్ ఎస్ సిబ్బంది వెంకటరావు, పెంటయ్య, సబల్ సిబ్బంది స్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఫారం పాండ్స్ మాస్ గ్రౌండింగ్‌కు భూమి పూజ

విశాలాంధ్ర-తెర్లాం : మండలంలో ఫారం పాండ్స్ మాస్ గ్రౌండింగ్ చేయించమని కమిషనర్ దగ్గర నుండి వచ్చిన ఆదేశాల ప్రకారం శుక్రవారం ఎంపీడీవో ఆర్.రాంబాబు ప్రతి గ్రామపంచాయతీలో ప్రజా ప్రతినిధులతో భూమి పూజ చేయించమని చెప్పడం జరిగింది. అలాగే మన మండలంలో పలు గ్రామాల్లో ఎమ్‌డిఓ ఆదేశాలు ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరంలో 75 ఫారం పాండ్స్ చేయించడం జరిగింది. అని ఉపాధి హామీ ఏపీవో సుశీల ఒక ప్రకటనలో విలేకర్లతో మాట్లాడుతూ తెలిపారు.

పోషణ్‌బీ పడాయిబీ ముగింపు కార్యక్రమం

విశాలాంధ్ర-దత్తిరాజేరు : కేంద్ర ప్రభుత్వంచే నిర్వహించబడిన అంగన్వాడి కార్యకర్తల 3 రోజులు పాటు శిక్షణ కార్యక్రమం శనివారం తో ముగిసిందని పెదమానాపురం సెక్టర్ కోరపు కొత్తవలస సెక్టర్ సూపర్వైజర్లు శ్యామలత, శకుంతల, తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవ చేతన ఆదర్శాల బాల్య ప్రారంభ సంరక్షణ పోషణ మరియు విద్య సార్వత్రిక అభివృద్ధి కోసం నిర్వహించబడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో 40 మంది అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా బాధితులకు చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-గుర్ల : మండలంలో గత ఏడాది నవంబర్‌లో గుర్ల గ్రామంలో డయేరియా బారినపడి పలువురు మృతిచెందిన విషయం తెలిసినదే. ఆ సమయంలో గుర్లలో పర్యటించిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. శనివారం నెల్లిమర్ల శాసనసభ్యులు, జనసేన పార్టీ విప్ లోకం నాగమాధవి, ఏపీటిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, AP MSME చైర్మన్ జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శ తుమ్మిరెడ్డి శివశంకర్,ఏపీ బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని, జనసేన పార్టీ పీఏసీ సభ్యులుపడాల అరుణమ్మ ఆర్థిక సాయాన్ని 10 కుటుంబాలకు సంబంధించిన ఒక్కొక్కరికి ఒక్కో లక్ష రూపాయలు చొప్పున చెక్కులను బాధితి కుటుంబాలకు అందజేశారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు తదితరు పాల్గొన్నారు.

టీబి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : టీబీ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పిలుపునిచ్చారు. ఈనెల 24న ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా, తమ చాంబర్లో శనివారం దీనికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి, జిల్లా టీబి కంట్రోల్ అధికారి డాక్టర్ కె.రాణి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు శిక్షణ



విశాలాంధ్ర-గజపతినగరం : గజపతినగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అంగన్వాడీలకు స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం ఫ్యాషన్ బి పడాయి ట్రైనింగ్ ప్రోగ్రాములు శనివారం నిర్వహించారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పక్కాగా అమలు చేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తాన్ బేగం ఆదేశించారు. కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణా కేంద్రాన్ని పీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తల్లులకు తప్పకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ నాగమణి, సూపర్వైజర్లు రమా కుమారి, భవాని, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరవు రహిత నియోజకవర్గమే లక్ష్యం

టిడిపి సీనియర్ నాయకులు కోండ్రు జగదీష్

విశాలాంధ్ర-రాజాం: మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సూచనలమేరకు రాజాం నియోజక వర్గం సీనియర్ తెదేపా నాయకులు కోండ్రు జగదీష్ శనివారం రాజాం మండలం గురవాం గ్రామంలో "పంట సంజీవని" కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోండ్రు జగదీష్ మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంపొం దించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం మెట్ట ప్రాంతాల్లో పంట సంజీవని (నీటి కుంటలు) కార్యక్రమం చేపడుతుందన్నారు.వర్షాలు పడని రోజుల్లో పంటలను కాపాడేందుకు 'పంట సంజీవని' పథకం తో రైతులకు మేలు చేకూరుతుందని అన్నారు.వీటి వల్ల భూగర్భజలాలు వృద్ధి చెందడంతో పాటు నీటి లభ్యత బాగుం టుందన్నారు. కరవురహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో గురువాన నారాయణరావు, యాగాటి రాము, ఎంపీడీవో వావులపల్లి శ్రీనివాసరావు ఎపిఓ. సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఫారం ఫోడ్స్‌తో రైతులకు మేలు

టిడిపి కార్యదర్శి కిమిడి మల్లిక్ నాయుడు

విశాలాంధ్ర-చీపురుపల్లి : వ్యవసాయ పొలాలకు అందుబాటులో ఫారం ఫండ్స్ ఏర్పాటు చేయడం వలన రైతులకు మేలు చేకూరుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి మల్లికినాయుడు అన్నారు. శనివారం నాడు చీపురుపల్లి మండలం, కర్లాం గ్రామంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఫారం ఫండ్స్ పనులకు శంకుస్థాపన జరిపారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పొలాలకు సమీపంలో వీటిని ఏర్పాటు చేయడం వలన నీటి నిల్వలు పెరుగుతాయి అన్నారు. వర్షాలు పడే సమయంలో నీటి ప్రవాహానికి అడ్డుకట్టుగా ఉండటం వలన భూగర్భ జలాలు కూడా పెరుగుదల అవుతుందన్నారు. మండలంలోని రైతులు వారీగా అవసరమైన చోట్ల నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ఉపాదా మీ ఏపీవో ఆది బాబు, మాజీ ఆర్య సేస్ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, తెలుగుదేశం పార్టీ కర్లాం ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

92 కిలోల గంజాయి సీజ్ : జీఆర్పీ సీఐ రవికుమార్ వెల్లడి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విజయనగరం, ఎస్ కోట రైల్వే స్టేషన్లలో శనివారం జీఆర్పి సిఐ రవికిరణ్ ఆధ్వర్యంలో ఎస్సై బాలాజీ రావు ఇతర సిబ్బంది తనిఖీలు నిర్వహించి 92 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం జీఆర్పి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ కోట రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తుండగా 61 కిలోల గంజాయినీ స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా విజయనగరం రైల్వే స్టేషన్లో తనిఖీ చేస్తుండగా 31 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ రెండు కేసుల్లో మొత్తం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించామని,ఢిల్లీ,ముంబై, హైదరాబాద్ చెందిన నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. గంజాయి పై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్లి జీవితం నాశనం చేసుకోవద్దని తెలిపారు. తన పరిధిలో ఉన్న అన్ని స్టేషన్లో గంజాయి పై నిరంతరం తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు ఈకార్యక్రమంలో ఎస్సై బాలాజీరావు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల పనులు పరిశీలన... పలువురిని పరామర్శించిన కొండ్రు జగదీష్

విశాలాంధ్ర-రాజాం : రాజాం నియోజకవర్గం సీనియర్ తెదేపా నాయకులు కోండ్రు జగదీష్ శనివారం చీపురువల్లి రోడ్డులో గల షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాజాం, చీపురుపల్లి రోడ్డులో రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఇప్పటికే రోడ్డు పనులు 90 శాతం వరకు పూర్తి అయ్యాయని మరికొద్ది రోజుల్లో రోడ్ల పనులు పూర్తికానున్నాయని తెలిపారు. అనంతరం రాజాం టౌన్ కొండకవీధిలో తెదేపా కార్యకర్త గన్ను రమేష్ అత్త ఇటీవల కాలంలో మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు,పొనుగుటి వలసలో తెదేపా కార్యకర్త టంకాల నాగరాజు మామయ్య ఈరోజు మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో గురవాన నారాయణరావు, నంది సూర్య ప్రకాశరావు, శాసపు రమేష్‌కుమార్, పిల్లా సత్యంనాయుడు, బలరాం, యాగటి రాము, రవీంద్ర, ధనుంజయ, నాగార్జున, శ్రీను, కొంపల్లి రవీంద్ర తదితర కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు, కమీషనర్ రామప్పల నాయుడు, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వలసలు తగ్గించడానికి ఉపాధి హామీ పనులు

ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

విశాలాంధ్ర-లక్కవరపుకోట : గ్రామాలలో ప్రజలు జీవనాధారం కొరకు వలసలు తగ్గించడం కోసమే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశమని ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల ఉపాధి హామీ పనులను పరిశీలించి పంట కుంట పనులకు భూమి పూజ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణ ప్రాంతాలకు పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి మారుమూల ప్రాంతానికి రోడ్లు వేసి ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించే విధంగా వలసలను నివారించే విధంగా ఉపాధి హామీ పనులను ప్రవేశపెట్టారని ఆమె అన్నారు. హారం పాండ్ల పనులను పరిశీలించి మరింత అభివృద్ధి చెందే విధంగా పనులను అవినీతికి తావు లేకుండా ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మల్లా రామకృష్ణ, నీటి సంఘం అధ్యక్షులు పుట్టా శ్రీనివాసరావు, ఏపీవో ఎం విజయలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పి-4 సర్వే సభలకు విశేష స్పందన

విశాలాంధ్ర-బొబ్బిలి : పురపాలక సంఘ పరిధిలో శనివారం 8 సచివాలయాలు, 24వ తేదీన 8 సచివాలయాలలో పి-4 సర్వే (పబ్లిక్, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం)పై వార్డు సభలు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వార్డు కౌన్సిలర్ లను, ఇంచార్జీలను, పి-4 సర్వేలో భాగస్వామ్యులను పిలిచి వార్డు సభలు నిర్వ హించారు. ఇందులో భాగంగా అట్టడుగున ఉన్న 20శాతం పేదవారిని కొన్ని సూచికల ఆధారంగా అనగా, పక్కా ఇళ్లు లేని వారు, విద్యుత్ కనెక్షన్ లేనివారు, సంపాదన లేనివారు, బ్యాంక్ అకౌంట్ లేనివారు, గ్యాస్ కనెక్షన్ లేనివారిని పేదవారుగా గుర్తించి, ఇంకా ఎవరైనా సర్వేలో అర్హులు నమోదు కాకపోతే వారిని కూడా నమోదు చేసి అప్లోడ్ చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. వార్డు సభలలో కంచర వీధి సచివాలయంలో జరిగిన సభకు 8వ వార్డు కౌన్సిలర్ ఆర్.శరత్‌బాబు, మేనేజర్ పీటీవీ రాఘవాచార్యులు, డీఈపి . కిరణ్ కుమార్, టిపిఆర్ఓ ఎం జగన్మోహనరావు, ఇంచార్జీలు, సచివాలయం సిబ్బంది వార్డు ప్రజలు పాల్గొన్నారు.

12 పంచాయితీల్లో ఫారం ఫాండ్ నిర్మాణాలు ప్రారంభం

విశాలాంధ్ర-కొత్తవలస : అంతర్జాతీయ జలదినోత్సవం పురస్కరించుకొని జలసంరక్షణకు గానూ కొత్తవలస మండలంలోని 12గ్రామ పంచాయితీల్లో ఫారంపాండ్ నిర్మాణాలకు శనివారం భూమిపూజ చేసి ప్రారంభించినట్లు కొత్తవలస మండల ఉపాధిహామీ ఏపిఓ జనార్ధనరావు తెలిపారు. దేశపాత్రునిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని 12పంచాయితీ గ్రామాల్లో సుమారు 165ఫారంపాండ్ నిర్మాణాలు పూర్తిచేసినట్లు వివరించారు. కొత్తవలస మండలంలోని 25పంచాయితీల్లో నాలుగు నెలల వ్యవదిధిలో 380 వరకూ ఫారంపాండ్ నిర్మాణాలు చేపట్టే దిశగా కృషిచేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ ఫారంపాండ్ల వలన భూగర్భ జలాల పెరుగుదల, మట్టిలో తేమ శాతం పెంపొందించడంతో పాటూ వ్యవసాయంలో రైతులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని వివరించారు. ప్రతీ వేతన దారుకు సగటున రోజుకు రూ.300 వేతనం లభించేలా రోజుకు కనీసం ఆరు గంటల పాటు ఉపాధి పనుల్లో పాల్గొనేలా ప్రభుత్వం పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

దేవస్థానం ఆధ్వర్యంలో చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం వనంగుడిలో (రైల్వేస్టేషన్ దరి) శనివారం మూల నక్షత్రము అమ్మవారి తిరునక్షత్రం పురస్కరించుకొని దేవస్థానం ఆధ్వర్యంలో లోక కళ్యాణార్ధం చండీ హెూమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ వేదపండితులు, రుత్విక్కులు సాయికిరణ్ శర్మ,వి.నరసింహమూర్తిశర్మ లు నిర్వహించిన ఈకార్యక్రమంలో పలువురు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.ఆలయంలో అమ్మవారి కి ఉదయం పంచామృత అభిషేకం నిర్వహించారు.గులాబి, చామంతి పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు.

విశాఖ స్టేడియానికి వైయస్ఆర్ పేరు తొలగించటం కూటమి దుష్టపాలనకు నిదర్శనం

ఎంపీపీ ఉత్తరా వెల్లి సురేష్ ముఖర్జీ

విశాలాంధ్ర-వంగర : విశాఖ స్టేడియానికి దివంగత ముఖ్యమంత్రి డా.వైయస్ రాజశేఖరరెడ్డి పేరు తొలగించటం 10నెలలు కూటమి దుష్టపాలనకు నిదర్శనమని ఎంపీపీయూ సురేష్ ముఖర్జీ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆయన వైయస్ఆర్సీపీ మండల కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్వాకంతో బ్రాండ్ ఏపీ అనేది పాతాళంలోకి పడిపోయిందన్నారు. పేర్ల మార్పు మీద చూపే శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధి,సంక్షేమ పథకాలు వెంటనే అమలు మీద లేకపోవడం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక హెల్త్ యూనివర్సిటీ, వైయస్ఆర్ జిల్లా పేర్లను కూడా మార్చిందని తప్పుపట్టారు. దీనివలన ఏం సాధించారో వారికే తెలియాలని ఆయన మండి పడ్డారు.వైయస్ జగన్ తెచ్చిన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయటం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదనిఆక్షేపించారు. కూటమి నాయకులు చెప్పే ప్రాజెక్టులు, అభివృద్ధి అంతా కాగితాల మీదే ఉందని ఎద్దేవా చేశారు. ఫలకాల మీద పేరు తొలగించినా జనం గుండెల్లో నుంచి వైయస్ఆర్ పేరును తొలగించలేరని ఎంపీపీ, జిల్లా అధికార ప్రతినిధి యు.సురేష్ ముఖర్జీ హెచ్చరించారు. ప్రజలకు మంచి చేయటానికి చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

నేరాల నియంత్రణకు యువత సహకరించాలి : ఎస్ఐ ఎల్.దామోదర్‌రావు

విశాలాంధ్ర-చీపురుపల్లి : గ్రామాలవారీగా ఎటువంటి నేరాలు జరగకుండా గ్రామాల్లో యువత పోలీసులకు సహకరించి నేరాలు అదుపులో ఉంచాలని చీపురుపల్లి ఎస్ ఐ ఎల్ దామోదర్ రావు అన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు మండలంలోని రాయవలస గ్రామంలో పోలీస్ సిబ్బందితో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో గ్రామ పెద్దలు యువతతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామంలో గల సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో ముందు యువత పెద్దలతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రధానంగా యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా వాటికి దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ తీసుకోవడం, అమ్మకం చేరపడం కూడా నేర పరిధిలోకి వస్తుందని ఆయన వివరించారు. డ్రగ్స్ వాడకం వలన ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక సమస్యలు కూడా అధికమవుతాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రత్యేకించి పెరుగుతున్న సాంకేతికతను ఆధారంగా చేసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారిపట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. అవగాహన లోపం కారణంగా సైబర్ నేరాలు వలలో ఎంతో మంది చిక్కుకొని ఆర్థికంగా నష్టపోవడానికి ఆయన వివరించారు. అదేవిధంగా రహదారి భద్రతలో భాగంగా ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను పూర్తిస్థాయిలో తమ వద్ద ఉంచుకోవాలని ఎస్సై తెలిపారు. నూతన చట్టాలు వాటి ఇది విధానాలు కోసం ఈ సందర్భంగా యువతకు వివరించారు. ప్రధానంగా పెద్దలు మహిళలు చిన్నపిల్లలు పట్ల యువత గౌరవప్రదంగా నడుచుకోవడం తోపాటు భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అనంతరం గ్రామ సచివాలయంలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా రాత్రి బస నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు హెచ్ సి రమణ తదితరులు పాల్గొన్నారు.

సీతంలో ఈ.సి.ఈ విభాగంలో లా ఫీస్టా వీడ్కోలు దినోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఈ.సి.ఈ విభాగానికి చెందిన విద్యార్థులు లా ఫీస్టా వీడ్కోలు దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ.సి.ఈ విభాగానికి చెందిన 2,3 సంవత్సరం విద్యార్థులు చివరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు దినోత్సవాన్నినిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ ప్రస్తుత కెరీర్ అభివృద్ధి చెందడానికి ఇక ముందు విద్యార్థులు ఎలా సన్నద్ధం కావాలో తెలియ చేశారు. విద్యార్థులు వేరు వేరు దారుల్లోకి అడుగుపెడుతున్నా, మన బంధం మాత్రం ఎప్పటికీ విడదీయలేని విధంగా ఉండాలని తెలియచేశారు. కళాశాల సంచాలకులు డాక్టర్ మజ్జి శశి భూషణరావు మాట్లాడుతూ ఈ నాలుగు సంవత్సరాలు జీవితంలో తీపి గుర్తులుగా మిగిలిపోతాయిని, కాలేజీ నుండి బయటకు వెళ్లి ఉద్యోగం చేయబోయే చివరి సంవత్సర విద్యార్థులు కాలేజీ ప్రతిష్టను ఇంకా పైకి తీసుకెళ్లాలని తెలియచేసారు. కళాశాల ప్రదానోచార్యులు డాక్టర్ డి.వి.రామమూర్తి మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులను గుర్తు పెట్టుకుని వారికి భవిష్యత్తులో సాంకేతికత అవసరాలు గురించి సూచనలు, సలహాలివ్వాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఇ.సి.ఇ విభాగాధిపతి, కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ టి.డి.వి.ఎ.నాయుడు, ఇతర విభాగాధి పతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోక్సో చట్టం, వాటర్ డేపై న్యాయవిజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర-రాజాం : మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం పోక్సో చట్టం, వాటర్స్ డే పై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కె. శారదాంబ మాట్లాడుతూ. నీటి ప్రాధాన్యత ప్రాముఖ్యత గూర్చి వివరించారు. జలం లేనిదే జీవం లేదని చెప్తూ, ప్రతీ ఒక్కరు నీటిని పొదుపుగా వాడాలన్నారు. భావితరాలకు పరిశుద్ధమైన గాలి, నీరు అందించేలా చర్యలు ఉండాలన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాలు అత్యంత బాధాకరమైన విషయమని ఆమె చెప్పారు. ముఖ్యంగా పిల్లల పట్ల తల్లిదండ్రులు, ఉ పాధ్యాయులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై సరైన అవగాహన కల్పించాలన్నారు. లైంగిక నేరాలకు పాల్పడిన వారిని శిక్షించేందుకు కఠినమైన చట్టాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ వి. శ్రీనివాసరావు . మున్సిపల్ కమీషనర్ జె. రామప్పలనాయుడు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆర్ సిహెచ్ జయదేవ్, న్యాయవాది రెడ్డి విజయ్ కుమార్, తోటపల్లి ప్రాజెక్ట్ డిఈఈ బి. శ్రీనివాస్, రెడ్ క్రాస్ మానవత సంస్థ ఛైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, పెంకి చైతన్యకుమార్ శానిటరీ ఇనెస్పెక్టర్ చేగొండి ప్రసాద్, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నీరే ప్రాణకోటికి జీవనాధారం : ఎంపీడీఓ భానుమూర్తి



విశాలాంధ్ర-మెంటాడ : లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జలదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో భానుమూర్తి మాట్లాడుతూ మంచినీటి వనరులు కాపాడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతని నివారించొచ్చని చెప్పారు. భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. కల్పన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కనీస అవసరాలకు రోజుకు 55 లీటర్లు నీరు అవసరమని చెప్పారు. తాగునీరు ద్వారా అతిసారం తదితర వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనం రక్షించుకోవచ్చని చెప్పారు. లెప్రా సొసైటీ కోఆర్డినేటర్ లెంక రమణ మాట్లాడుతూ నీటి వనరులు ఉపయోగం, జవనరుల సంరక్షణ పద్ధతులపై వివరించారు. వర్షపు నీటిని ఇంకుడు గుంతలు ద్వారా ఆదా చేయెచ్చని చెప్పారు. గ్రామ చెరువులను ప్రజలు కాపాడుకోవాలని సూచించారు. నీటిని రీసైక్లింగ్ చేయడం ప్రజలు పాటించాలని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అంగవాడీ కార్యకర్తలకు నీటి సంరక్షణ పద్ధతులపై అవగాహనా కల్పించారు. ఈకార్యక్రమంలో అంగనవాడి సూపర్ వైజర్ పి. ధనలక్ష్మి, కె.హైమా, గాయత్రి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ నారాయణరావు, హెచ్.వి జ్యోతి, సూపర్ వైజర్ పి.వి.రమణ, లెప్రా సొసైటీ సిఆర్పీలు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డ్రాయింగ్ పోటీలో గెలుపొందిన విద్యార్థులు కు పాఠశాల ప్రధానోపధ్యాయు చేతులు మీదగా బహుమతులు అందజేయటం జరిగింది.

నాటు సారా రహిత సమాజం కోసం ఎక్సైజ్ శాఖ సిబ్బందికి సహకరించాలి

ఎక్సైజ్ శాఖ సీఐ పామోటి

విశాలాంధ్ర-బొబ్బిలి : మండలంలోని కొయ్యకొండవలస గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమం ఎక్సైజ్ శాఖ సీఐ పామోటి చిన్నమనాయుడు నాటు సారా నిర్మూలన కొరకు గ్రామంలో యువకులు, పెద్దలుకు, మహిళలకు, అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా నాటు సారా తయారుచేసిన, నాటు సారా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్కిల్ పరిధిలో నాటు సారా నిర్మూలన ధ్యేయంగా పనిచేస్తున్నామని. అన్ని వర్గాల ప్రజలు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నం నాయుడు కోరారు.

ప్రతి వేతనదారునికి రూ.300 సగటు వేతనం రావాలి

- వేతనదారులు రెండు పూటలా పనిచేయాలి : కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్
- కెరటాంలో పంటకుంటల (ఫారంపాండ్) పనులు ప్రారంభించిన కలెక్టర్
- స్వయంగా గునపం చేతబూని పనులు ప్రారంభించిన కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం(బొండపల్లి) : జిల్లాలో ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే ప్రతి వేతనదారుకు కనీసం రోజుకు రూ.300 వేతనం వచ్చేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. వేతనదారులు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో కనీసం ఆరు గంటలపాటు పనుల్లో పాల్గొనడం ద్వారా వారికి రోజుకు రూ.300 కనీస వేతనం లభించేలా చూడొచ్చన్నారు. ఉపాధి వేతన దారులు ప్రతి రోజూ ఉదయం 6.30 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6.30 వరకు పనుల్లో పాల్గొనడం ద్వారా రోజుకు రూ.300 వేతనాన్ని పొందవచ్చని చెప్పారు. వరల్డ్ వాటర్ డే సందర్భంగా జల సంరక్షణలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో రైతుల వ్యవసాయ భూముల్లో చేపట్టిన ఫారంపాండ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ శనివారం బొండపల్లి మండలం కెరటాంలో ప్రారంభించారు. కెరటాంలో చింతపల్లి సూర్యనారాయణ అనే రైతుకు చెందిన నాలుగు ఎకరాల మామిడితోటలో పంటకుంటలు(ఫారంపాండ్) తవ్వే పనులను కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. మహిళా వేతనదారులతో, భూమి యజమానులతో భూమిపూజ చేయించిన అనంతరం కలెక్టర్ గునపం చేతబూని మట్టి తవ్వి పంటకుంటలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడిన కలెక్టర్ రోజుకు వారు ఎన్ని గంటలు పనిలో పాల్గొంటున్నారు. ఎంత సగటు వేతనం వస్తోందనే అంశాలను తెలుసుకున్నారు. తమకు సగటున రూ.250 వరకు వేతనం అందుతోందని వేతనదారులు వివరించారు. పంటకుంట తవ్వేందుకు ఎంత మొత్తంలో ఉపాధినిధులు ఖర్చు చేస్తున్నదీ కలెక్టర్ తెలుసుకున్నారు. రూ.23 వేలతో ఇక్కడ పంటకుంట ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని ఏపిఓ కృష్ణవేణి వివరించారు. అనంతరం అదే గ్రామంలో గణరాజు లక్ష్మణరావుకు చెందిన కొబ్బరితోటలో తవ్విన పంటకుంటను కలెక్టర్ పరిశీలించారు. అక్కడ వేతనదారులతో, భూయజమానితో మాట్లాడారు. ఇక్కడ పంటకుంట ఏర్పాటుకు రూ.60,979 మంజూరు చేయడం జరిగిందని, గత ఆరురోజులుగా ఇక్కడ పనిచేస్తున్నట్టు వేతనదారులు చెప్పారు. ఈ ఏడాది ఎన్ని రోజులు పనిచేశారని మహిళా వేతనదారులను కలెక్టర్ ప్రశ్నించారు. సుమారు 60 నుంచి 70 రోజులు పనిచేశామని వారు కలెక్టర్‌కు చెప్పారు. జిల్లాలో ప్రతి మండలంలోనూ కొన్ని పంటకుంటలను శాస్త్రీయ పద్ధతిలో పూర్తి స్థాయిలో జలసంరక్షణ జరిగేలా రూపొందించాలని డ్వామా పి.డి. శారదాదేవిని కలెక్టర్ ఆదేశించారు. ఈనెలలో 3215 పంటకుంటలను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు డ్వామా పి.డి. వివరించారు. జిల్లాలో శనివారం నాడు 731 పంటకుంటల నిర్మాణం పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ పర్యటనలో జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, గ్రామ సర్పంచ్ నంబూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్లైను బెట్టింగు యాప్‌లతో జీవితాలను నాశనం చేసుకోవద్దు : జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఆన్లైను బెట్టింగు యాప్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, పిలుపునిచ్చారు. నేటి నుండి ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆన్లైను, ఆఫ్లైను క్రికెట్ బెట్టింగులకు పాల్పడేవారు, ముఖ్యంగా యువత అప్రమత్తం ఉండాలని, ఆర్థికంగా జీవితాలను నాశనం చేసే బెట్టింగు యాప్ల జోలికి పోవద్దని ప్రజలు, యువతను హెచ్చరించారు. బెట్టింగు యాప్‌లు వినియోగం వలన ఆర్థికంగా ఎక్కువగా నష్టం కలిగించి, సాఫీగా సాగిపోతున్న జీవితాలను నాశనం చేస్తాయన్నారు. చిన్న మొత్తాలతోప్రారంభించిన బెట్టింగులు, ఆశక్తి పెరిగే కొద్ది పెద్ద మొత్తంలో డబ్బులను బెట్టింగుకు పెట్టి, చివరకు ఆర్థికంగా పెద్ద మొత్తంలో నష్టపోతారన్నారు. బెట్టింగుల్లో ఎదురైన ఓటముల్లో నష్టాన్ని అధిగమించేందుకు మరింత ఎక్కువ పెట్టుబడులు పెట్టడం వలన మరిన్ని అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. బెట్టింగు యాప్లను ప్రారంభంలో సరదాగా వినియోగించి, చివరకు వ్యసనంగా మారే పరిస్థితులకు చేరుకొంటారన్నారు. ఒకసారి బెట్టింగులకు అలవాటు పడిన వ్యక్తులు తమ ఆలోచనలన్నీ బెట్టింగు మీదనే పెట్టి, ఆర్థిక నష్టాలతో కుటుంబ సభ్యులతో గొడవలకు పాల్పడతారన్నారు. బెట్టింగులకు అలవాటుపడిన వ్యక్తులు కుటుంబ అవసరాలను నిర్లక్ష్యం చేస్తూ, సంపాదనంతా బెట్టింగుల్లోనే పోగొట్టుకొనే ప్రమాదం ఉందన్నారు. ఈ తరహా బెట్టింగు యాప్లను వినియోగించడం, ఆఫ్ లైను బెట్టింగులకు పాల్పడడం చట్ట విరుద్ధమని, ఎవరైనా బెట్టింగులకు పాల్పడి పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈతరహా కేసుల్లోనిందితులపై న్యాయస్థానాల్లో నేరం రుజువైతే జైలు శిక్షలు, పెద్ద మొత్తంలో జరిమానాలు తప్పవన్నారు. కావున, ప్రజలు, ముఖ్యంగా యువత తమ జీవితాలను నాశనం చేసే బెట్టింగు యాప్ల జోలికి పోవద్దన్నారు. బెట్టింగులతో డబ్బులు సంపాదించవచ్చున్న పేరాశతో బెట్టింగులకు పాల్పడే కంటే ఆర్థిక భద్రత కోసం కష్టపడి పని చేయడం, న్యాయబద్ధంగా సంపాదించిన నగదును సద్వినియోగం చేసుకోవడం ఉత్తమమైన మార్గమని ప్రజలకు జిల్లా ఎస్పీ సూచించారు. ఆన్లైను లేదా ఆఫ్లైను బెట్టింగులకు పాల్పడేవారి సమాచారాన్ని డయల్ 112/100 లేదా 912109483కి అందించాలని ప్రజలను కోరారు.

సీతంలో ప్రపంచ జల దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో "ప్రపంచ జల దినోత్సవం 2025" వేడుకలు నిర్వహించారు. ఈ ఏడాది థీమ్ "హిమనీనదాలు సంరక్షణ-స్థిరమైన జల భవిష్యత్తు"పై విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామీణ నీటీ సరఫరా, పారిశుద్ధ్య విభాగం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యడ్ల గోవిందరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిమనీనదాలు సంరక్షణ, ప్రాముఖ్యత గురించి సమగ్రంగా వివరిస్తూ, వాటిని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రపంచంలోని తాజా నీటి వనరుల్లో హిమనీనదాలు కీలక భూమిక వహిస్తున్నాయని, వాటి పరిరక్షణ కోసం సామూహికంగా కృషి చేయడం అత్యవసరం" అని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి మాట్లాడుతూ, ప్రకృతి యొక్క మూడు ప్రధాన మూలాధారాలు - నీరు, భూమి, వాయుమండలాల మధ్య సమతుల్యతను అర్థం చేసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. ఈ కార్యక్రమం నీటి ప్రాముఖ్యతను గుర్తు చేసే ఒక గొప్ప అవకాశం అని తెలియజేసారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ నీటి సంరక్షణ అనేది భవిష్యత్ తరాల కోసం అత్యంత అవసరమని, దీనిపై అవగాహన కల్పించడమే కాకుండా, దానిని అనుసరించడం కూడా అంతే ముఖ్యమైనదని అన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.రవి కిశోర్ హిమనీనదాలు మన గ్రహానికి సహజసిద్ధమైన ప్రకృతి నీటి కోటలని, ఇవి ప్రపంచ జల పరిపాలనా వ్యవస్థలో అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు. భవిష్యత్తులో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు స్థిరమైన మౌలిక వసతుల రూపకల్పనలో భాగస్వాములై, నీటి సరఫరా, పరిరక్షణ, నిర్వహణలో కీలక పాత్ర పోషించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు. నీటి సంరక్షణ బాధ్యత ప్రతీ ఒక్కరిది అనే సందేశాన్ని అందరూ పునరుద్ఘాటించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

విశాలాంధ్ర-వేపాడ : పార్టీలకు అతీతంగా అదికారులు పారదర్శకంగా వ్యవహరించాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులపై ధ్వజమెత్తారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు(సతీష్) అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు మట్లాడుతూ పంచాయతీల తీర్మానం మేరకు మంజూరు చేయాల్సిన గోకులం షెడ్డులను అధికార పార్టీవారికి మాత్రమే మంజూరు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఎంపీపీ సత్యవంతుడు మట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సేవలందించేందుకు ప్రజలు మమ్మల్ని ప్రజా ప్రతినిదులుగా ఎన్నుకున్నారని పథకాల మంజూరులో రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు.అలాగే బానాది ఎంపీటీసీ సభ్యురాలు గొంప తులసీ మట్లాడుతూ నన్ను కూడా ఎంపీటీసీగా ప్రజలే ఎన్నుకున్నప్పటికి ఎంపీపీ నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మట్లాడుతూ బానాది గ్రామంలో గత ప్రభుత్వం నిర్మించిన సచివాలయ కొత్త భవనంలో సజావుగా పాలన జరుగుతుండగా స్థానిక ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి సచివాలయంను పాత పంచాయతీ భవనంలోకి మార్చడం ఎంతవరకూ సబబు అని ప్రశ్నించారు. అలాగే పంచాయతీ పాలకవర్గం సమావేశాలను జరపాల్సిన పంచాయతీ కార్యదర్శి మూర్తి ఎందుకు పట్టించుకోవడం లేదని, ఎంపిడిఓ, పంచాయతీ విస్తరణ అధికారి ఏం చేస్తున్నారని సంభందిత అధికారులపై సభ్యులు ధ్వజమెత్తారు. సభ్యుల ఆందోళనపై స్పందించిన ఎంపిడిఓ సూర్యనారాయణ,ఈఓపీఆర్డి రవికుమార్ లు మట్లాడుతూ వారం రోజుల్లో నోటీసులు ఇచ్చి పంచాయతీ కార్యదర్శి చేత సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.అనంతరం అన్ని శాఖల పనితీరుపై శాఖ పరంగా చర్చలు జరిపారు. అలాగే ఎంపిడిఓ సూర్యనారాయణ మట్లాడుతూ ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై బీసీలకు ఋణాలు మంజూరు చేసేందుకు ఆదేశాలు జారీ చేసినందున అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు పెట్టుకోవాలని సూచించారు. లక్ష, రెండు లక్షలు, ఐదు లక్షల వరకూ ఋణాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, మండల తహసీల్దార్ రాములమ్మ, వైస్ ఎంపీపీలు అడపా ఈశ్వరరావు, దాయిరి ముత్యాలమ్మ, డిసిసిబి మాజీ ఛైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు,అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల పొలాల్లో మట్టి లోడ్‌లు అడ్డుకున్న చెక్ పోస్ట్ సిబ్బంది

ఆగ్రహించిన రైతులు ట్రాక్టర్ల యజమానులు
కొండగంగు పూడి రోడ్డులో ట్రాక్టర్లు జెసిబిలతో నిరసన చేపట్టిన రైతులు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన వ్యవసాయ రైతుల పొలాల్లో మట్టి తోలుకుంటున్న ట్రాక్టర్లను మైనింగ్ చెక్ పోస్ట్ సిబ్బంది అడ్డుకోవడంతో ఆగ్రహించిన రైతులు ట్రాక్టర్ యజమానులు కొండగంగు పూడి రహదారిలో ట్రాక్టర్లను జెసిబిలను పెట్టి నిరసన వ్యక్తం చేశారు. రైతుల పొలాల్లో నుండి లోతట్టు పొలాల్లోకి మట్టి తోలుతున్న ట్రాక్టర్లను చెక్ పోస్ట్ సిబ్బంది అడ్డుకోవడంపై బొద్దాం రైతులు కన్నెర్ర చేశారు.చెక్ పోస్ట్ సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా రైతుల పొలాల్లో నుండి లోతట్టు పొలాలకి మట్టి తోలుతుంటే ట్రాక్టర్లను జెసిబిలను అడ్డుకోవడం దారుణం అంటూ రైతులు ట్రాక్టర్ యజమానులు తీవ్రంగా ఆక్షేపిస్తు చెక్ పోస్ట్ సిబ్బంది తీరుకు నిరసన వ్యక్తం చేశారు .రైతులు పొలాల నుండి మట్టి తోలుకుంటే అడ్డుకోవడమే కాకుండా భూగర్భ గనుల శాఖ అధికారులకు ఫిర్యాదులు చేయడంపైఆగ్రహించారు.ప్రభుత్వం చెక్ పోస్ట్ పెట్టుకొనుటకు అనుమతులు ఇచ్చిన రైతులు పొలాల్లో మట్టి తోలుతుంటే అభ్యంతరం పెట్టడం రైతుల వద్ద నుండి డబ్బులు వసూలు చేసుకోవడం అన్యాయం అంటున్నారు.రైతుల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నామని ప్రకటనలో గుప్పిస్తున్న ప్రభుత్వ పాలకులు స్పందించి ఏ జిల్లాల్లో లేని మైనింగ్ విధానాలను విజయనగరం జిల్లాలో అమలుచేసి రైతులు సామాన్య ప్రజలను నెత్తిన భారం మోపుతున్నారని ధ్వజమెత్తారు .ప్రభుత్వ అనుమతులు పేరుతో చెక్ పోస్ట్ సిబ్బంది రైతులు సామాన్య ప్రజలను ఇబ్బందికి గురిచేస్తే అక్రమ వసూళ్లకు పాల్పడి ఆర్థికంగా నష్టపరుస్తున్నారంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి స్థానిక ఎమ్మెల్యేలు స్పందించి చెక్ పోస్ట్ అక్రమ వసూళ్లపై దృష్టి సారించి సామాన్యులకు ఆదుకోవాలని కోరుకుంటున్నారు.లేకుంటే తీవ్ర పరిణామాలకు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. చెక్ పోస్ట్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్సై బొడ్డి దేవి ట్రాక్టర్ యాజమాన్యం, రైతులతో మాట్లాడి విషయాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ యాజమాన్యంతో ఫోన్లో మాట్లాడుతూ మీరు ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ నమో చేస్తానంటూ చెక్ పోస్ట్ యాజమాన్యానికి హామీ ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం మైన్స్ అధికారులతో మాట్లాడి రైతులు పొలాల్లో నుండి మట్టి తోలుకుంటున్నామని వారికి వివరించారు.అడ్డుకున్న అధికారులు వచ్చి సమాధానం చెప్పాలని లేకుంటే ఆందోళన చేపడతామని రైతులు ట్రాక్టర్ యజమానులు మొండిపట్టు పట్టుకు కూర్చున్నారు.

అంగన్వాడీ కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలి

కేసలి అప్పారావు

విశాలాంధ్ర-గుర్ల : అంగన్వాడీ కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలో గుజ్జింగివలస జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాలలో గరివిడి, గుర్ల ప్రాజెక్టు పరిధిలో గల అంగన్వాడీ కార్యకర్తలకు గత మూడు రోజులుగా పోషన్‌బీ పడాయ్‌బీలో భాగంగా నవచేతన్, ఆధార్ శీల మీద శిక్షణా కార్యక్రమాలు జరుగుచున్న నేపథ్యంలో ఈరోజు ముగింపు కార్యక్రమానికి కేసలి అప్పారావు హాజరై అంగన్వాడీ సిబ్బంది ఉద్దేశించి మాట్లాడుతూ నిరంతరం కేంద్రంలోగల పిల్లలపై పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని,ఆటలు, చదువు, ఆహారంపై ముఖ్యంగా శ్రద్ధ చూపడం అవసరమని తెలిపారు. బాల్య వివాహాలు, అనధికార దత్తత జరగకుండా చూడాలని, కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఎస్.ఆరుద్ర సూపర్వైజర్‌లు రాధిక, శకుంతల, పద్మ, శుభ, జ్యోతి, ఉమా పాల్గొన్నారు.

పి-4 విధానంపై వార్డు సభలు నిర్వహణ

విశాలాంధ్ర-విజయనగరం : నగరంలో అన్ని సచివాలయాల పరిధిలో పి.4 విధానంపై వార్డు సభలు జరిగాయి. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో సచివాలయాల కార్యదర్శులు వార్డు సభలను ఏర్పాటు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం వార్డు సభలు నిర్వహించినట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు ప్రజల భాగస్వామ్యంతో బిఫోర్ అనే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా ప్రవాస ఆంధ్రులు, సంపన్న కుటుంబాలు అత్యంత వెనుకబడ్డ కుటుంబాలకు సహాయం చేయడానికి ప్రోత్సహించడానికి మరింత ప్రగతివైపు పైనింప చేయడానికి ఈ కార్యక్రమం ఉద్దేశించబడిందని అన్నారు. కేవలం దాతృత్వానికి పరిమితం కాకుండా దీర్ఘకాలిక సాధికారిక, భాగస్వామ్య సంపన్నత అనే లక్ష్యంతో సాగాలన్నారు. సేకరించిన ప్రజాభిప్రాయాన్ని నివేదించనున్నట్లు తెలిపారు.

పొలాల్లో నీటి గుంతలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-భోగాపురం : రైతులు తమ పొలాల్లో నీటి గుంతలు ఏర్పాటు చేసుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. మండలంలోని చినరావాడ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో మంజూరైన ఫారం ఫాండ్‌కు శనివారం సాయంత్రం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గుంతల్లో నీరు నిల్వ ఉంటే పశువులకు, తోటలు పెంపకానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అలాగే రావాడ గ్రామం నుంచి చినరావాడ గ్రామానికి తారు రోడ్డు మంజూరు చేయాలని మాజీ ఏఎంసీ చైర్మన్ దంతులూరి సూర్యనారాయణ రాజు ఎమ్మెల్యేను కోరారు. ఈ గ్రామానికి రోడ్డు వేస్తానని ఎలక్షన్లో హామీ ఇచ్చినందున తప్పకుండా మంజూరు చేయిస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏ.పైడినాయుడు, ఏపీడి పద్మజ, ఎంపీడీవో గాయత్రి, ఏపీవో భాగ్యలక్ష్మి, నాయకులు మట్టా అయ్యప్ప రెడ్డి, వందనాల రమణ కొండపు రాధాకృష్ణ, సీతంనాయుడు, కిరణ్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.